సాక్షి
హైదరాబాద్
శనివారం । 30 । డిసెంబర్ । 2023

అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో గోల్డ్ ఏటీఎం



మెట్రో రైలు ప్రయాణికులకు గోల్డ్ ఏటీఎం సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల సౌకర్యార్థం 'గోల్డ్ సిక్కా' కంపెనీ అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో శుక్రవారం మొదటి గోల్డ్ ఏటీఎం కంపెనీ సీఈఓ తరుజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వెర్షన్‌తో ఏటీఎం నుండి కొనుగోలుదారు వీలును బట్టి గోల్డ్ లేదా సిల్వర్ కాయిన్స్ కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. డెబిట్, క్రెడిట్, యూపీఐ ద్వారా కొనుగోలు చేసుకునే వీలుందని చెప్పారు. త్వరలో మన దేశంతో పాటు విదేశాల్లో 2 వేల నుంచి 3 వేల ఏటీఎంలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రష్యా, అమెరికా వంటి దేశాల నుండి ఆర్డర్లు వస్తున్నాయని వివరించారు. వైజాగ్‌లోని బ్యూటీ వరల్డ్ ఏ సంస్థతో మొదటి ఏటీఎంకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయా రెడ్డి, సినీ నటుడు అనంత్, సంస్థ ప్రతినిధులు అంబికా బర్మన్, ఫణి ప్రతాప్, యుగ టెక్నాలజీ ప్రతినిధి డా.ప్రవీణ్ పాల్గొన్నారు. – అమీర్‌పేట

4.98 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో శుక్రవారం అభయహస్తం కింద వివిధ గ్యారంటీల కోసం 3,13,226 దరఖాస్తులందాయి. ఇప్పటి వరకు మొత్తం 4,98,428 దరఖాస్తులందాయి.

జోన్	శుక్రవారం	మొత్తం
ఎల్బీనగర్	41639	69393
చార్మినార్	76379	115418
ఖైరతాబాద్	48856	77532
కూకట్‌పల్లి	58723	95188
శేరిలింగంపల్లి	27525	43713
సికింద్రాబాద్	53589	86902
కంటోన్మెంట్	6515	10282
మొత్తం	313226	498428

ఇతర అవసరాల కోసం రెండు రోజుల్లో వెరసి మొత్తం 71,325 దరఖాస్తులందాయి.

హెవీ రష్

అటు గ్యాస్ కనెక్షన్‌దారుల కేవైసీ...ఇటు ఆధార్ కార్డు అప్‌డేషన్..మరోవైపు ప్రజాపాలనలో అభయహస్తం పథకాల దరఖాస్తుల స్వీకరణ కారణంగా నగరంలో కాలనీలు, వార్డులు కిక్కిరిసిపోతున్నాయి. శుక్రవారం కూడా అభయహస్తం దరఖాస్తులు భారీ సంఖ్యలో వచ్చాయి. ఇక గ్యాస్ కనెక్షన్ కేవైసీ చేసుకునేందుకు వినియోగదారులు భారీ సంఖ్యలో గ్యాస్ ఏజెన్సీల ఎదుట క్యూకట్టారు. ఆధార్ అప్‌డేట్ కోసం కూడా వివిధ ఆధార్ సేవా కేంద్రాలు, ఈ సేవ సెంటర్ల వద్ద పడిగాపులు కాశారు. – సాక్షి,స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ముసారంబాగ్ మెట్రో స్టేషన్‌లోని ఆధార్ సేవా కేంద్రంలో రద్దీ


గోషామహల్ పరిధిలోని ఆగాపురలో ప్రజాపాలనకు హాజరైన జనం


గ్యాస్ కనెక్షన్ కేవైసీ కోసం మలక్‌పేటలో ఓ గ్యాస్ ఏజెన్సీ ముందు బారులు

న్యూస్‌రీల్

ఫీవర్‌లో మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. శుక్రవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో మొత్తం 31 మంది అనుమానితుల నుంచి శాంపిల్స్ సేకరించి ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా వారిలో ముగ్గురికి పాజిటివ్‌గా తేలిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరిలో ఒకరు అనారోగ్యంతో ఫీవర్ ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి కాగా మిగిలిన ఇద్దరు నగరంలోని ఓ యూపీహెచ్‌సీ నుంచి వచ్చిన వారి శాంపిల్స్ అని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నారు. ప్రస్తుతం ముగ్గురు కూడా హోం ఐసోలేషన్‌లో ఉన్నారని చెప్పారు. రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతున్న కారణంగా వైరస్ మరింతగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

డ్రగ్స్ పట్టివేత


నిందితుడు శివరాంపూర్ బాబు కిరణ్

ఫిలింనగర్: నూతన సంవత్సరం సందర్భంగా పబ్‌ల వద్ద డ్రగ్స్ విక్రయించేందుకు బెంగళూరు నుంచి వచ్చిన యువకుడిని ఫిలింనగర్ పోలీసులు పక్కా సమాచారంతో అరెస్ట్‌చేసి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బెంగళూరు నగరంలోని నల్లూరహల్లి కాలనీలో నివసించే శివరాంపూర్ బాబు కిరణ్ (26) క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈజీమనీ కోసం అలవాటుపడి కొంత కాలంగా బెంగళూరులో డ్రగ్స్ కొనుగోలుచేస్తూ వివిధ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ప్రస్తుతం నూతన సంవత్సర హంగామా చోటు చేసుకోవడం..హైదరాబాద్‌లో డ్రగ్స్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూ. 6 వేలకు గ్రాము చొప్పున 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను తీసుకొని గురువారం ఉదయం ట్రైన్‌లో హైదరాబాద్‌కు వచ్చాడు. ఇక్కడ రూ.8 నుంచి 10 వేలకు గ్రాము చొప్పున విక్రయించేందుకు ప్రణాళిక వేసుకొని గురువారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని పబ్‌ల వద్ద తిరిగాడు. శుక్రవారం మధ్యాహ్నం కూడా డ్రగ్స్ తీసుకొని విక్రయించేందుకు జూబ్లీహిల్స్‌కు ఫిలింనగర్ నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు సదరు వ్యక్తిని పట్టుకొని తనిఖీలు చేయగా 20 గ్రాముల ఎండీఎంఏ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కులగణనపై రాహుల్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కాచిగూడ: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా జనగణనలో కుల గణన చేపడతామని ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఓబీసీ ప్రధాని అని చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ బీసీ కులగణనను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా సమగ్ర కులగణనను తామే చేపడతామని ప్రకటించడం హర్షించదగ్గ పరిణామమని, దీనిపై బీజేపీ ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. కులగణనపై చాలా స్పష్టమైన వైఖరితో ఉన్న రాహుల్ గాంధీకి దేశంలోని 60 శాతం బీసీల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కుల గణన చేపట్టే పార్టీకే పార్లమెంట్ ఎన్నికలలో బీసీల మద్దతు ఉంటుందని తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, నందగోపాల్, ఉదయ్ నేత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

2024 డీజే జేజే

సిటీలో న్యూఇయర్ జోష్

'డీజే కిమ్..డెక్‌లను తిప్పడానికి సిద్ధంగా ఉన్నారు. ఆమె ఎలక్ట్రిఫయింగ్ బీట్‌లతో రాత్రంతా మిమ్మల్ని నిర్విరామంగా డ్యాన్స్ చేయిస్తారు' గచ్చిబౌలిలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరుగనున్న న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వాహకులు ఇస్తున్న హామీ ఇది. నగరం ఆదివారం కొత్త సంవత్సరానికి జేజేలు పలకనుంది. నగరంలో ఉన్న డిస్క్ జాకీలు పూర్తిగా తమ తమ సంగీతాస్త్రాలతో సిద్ధమైపోగా వీడియో జాకీ (వీజే)లు వినోదాన్ని పంచనున్నారు. ఇక రేడియో చానెల్స్ ద్వారా పేరొందిన రేడియో జాకీ (ఆర్‌జె)లు సైతం తోడు కలుస్తుండడంతో సిటీజనులు మ్యూజిక్‌కి 'జే'జే...అననున్నారు. –సాక్షి, సిటీబ్యూరో

- దేశ, విదేశీ డీజేల రాకతో కదం తొక్కనున్న సంగీతం
- స్కిట్స్, స్టాండప్ కామెడీలతో వినోదం
- క్యాంప్‌ఫైర్స్, స్టే టెంట్స్‌తో సరికొత్త ఒరవడి
- చారిటీ ఈవెంట్‌కూ తెరదీసిన గేటెడ్ కమ్యూనిటీ

నగరంలో గతంతో పోలిస్తే మరీ ఉధృతంగా ఉందని చెప్పలేకపోయినా...నూతన సంవత్సర వేడుకల జోష్ బాగానే ఉంది. మరోసారి సిటీ మ్యూజిక్ కిక్‌తో న్యూ ఇయర్‌కు స్వాగతం పలకనుంది. నగరవ్యాప్తంగా పబ్స్, క్లబ్స్, కాఫీషాప్స్, ఫంక్షన్ హాల్స్, రిసార్ట్స్..అని తేడా లేకుండా ప్రతీ చోటా ఈవెంట్స్ జరుగుతున్నాయి. వాటిలోని కొన్నింటి వివరాలు...విశేషాలు...

- హైటెక్‌సిటీలోని క్లౌడ్ డైనింగ్ రెస్టారెంట్‌లో రోల్ రిడా, డీజే చైతు, అరియానా గ్లోరీ దామిని భట్ల, సయ్యద్ సోహెల్ వంటి సెలబ్రిటీలు సందడి చేయనున్నారు..
- మాసాయిపేటలోని సాఫ్రాన్ వ్యాలీ రిసార్ట్స్‌లో అంతర్జాతీయ డీజే లియా లిస్సే సిటీ డీజే ఎస్‌తో కలిసి మ్యూజిక్ హోరు పంచనున్నారు. టీవీ స్టార్ పాండు మాస్టర్ డ్యాన్స్‌తో పాటు క్యాంప్‌ఫైర్, డేరాల్లో బస, జంగిల్ ట్రెక్కింగ్ స్టే టెంట్లు కూడా అందుబాటులో ఉన్నాయి
- బేగంపేట్‌లోని కంట్రీ క్లబ్ ఢిల్లీకి చెందిన మ్యూజిక్ బ్యాండ్ ద్వారా న్యూ ఇయర్‌కి స్వాగతం చెబుతోంది.
- బేగంపేటలో హాకీ స్టేడియంలో 'మిస్టికల్ బీట్స్' ఈవెంట్‌లో లండన్‌కు చెందిన డీజేలు ఆండ్రా స్విట్స్ విల్లా ఫేం డీజే సోనాలి కత్యాల్‌లు హైలెట్‌గా నిలవనున్నారు.
- కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో సెలబ్రిటీ డీజే షారోన్ తళుక్కుమననున్నారు.
- హెచ్‌సీసీ గండిపేట్, ఓరోలాన్స్ అండ్ కన్వెన్షన్‌లో థియరీ రాక్ బ్యాండ్ సందడి చేయనుంది.
- మొయినాబాద్ కంట్రీసైడ్ రిసార్ట్స్‌లో సంగీతం, సెల్ఫీ బూత్‌లు, ఫుడ్ స్టాల్స్, బాణసంచా, స్పిన్నిన్ వైబ్జ్ రాక్ ప్రదర్శనతో న్యూ ఇయర్ జోష్‌ను పంచుకోనుంది.
- షామీర్‌పేట్‌లోని సెలబ్రిటీ రిసార్ట్స్‌లో రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు ఫ్రాన్స్ డిజె అమండా కార్టా సంగీతాన్ని పరుగులు పెట్టించనున్నారు.
- మాదాపూర్‌లోని ప్రిజం క్లబ్ సర్కస్ 3.0ని సమర్పిస్తోంది. సెవెన్, అలీ మర్చంట్, డిజె కవాల్ తదితరులతో సర్కస్-థీమ్ తో నిర్వహించే ఈ ఈవెంట్ యువతను ఉర్రూతలూగిస్తుందని నిర్వాహకులు హామీ ఇస్తున్నారు.
- హైటెక్స్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో క్యాప్రిసియో బ్యాండ్ ప్రదర్శన, గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్, అంతర్జాతీయ కళాకారులైన సమ్‌థింగ్ ఫిష్ రోమియో బ్లాంకోలతో పూర్తిస్థాయి ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌గా అలరించనుంది.
- మాదాపూర్‌లోని డిస్ట్రిక్ట్ 150 సినాప్సిస్ ఈవెంట్ నిర్వహిస్తోంది. ఇక్క లైవ్ బ్యాండ్‌తో పాటు స్టాండ్-అప్ కామెడీ ని జత చేస్తున్నారు.





సేవకూ సై..

గేటెడ్ కమ్యూనిటీ న్యూ ఇయర్ పార్టీలో ఓ చారిటీ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. అవసరార్థుల సేవ కోసం విరాళాలు సేకరించేందుకు న్యూ ఇయర్ వేడుకను వేదికగా చేసుకుంటున్నారు. మియాపూర్‌లోని దివ్యశ్రీ శక్తి గేటెడ్ కమ్యూనిటీ ఈ తరహా వేడుకకు తెరతీసింది.

35 ఎకరాల్లో నైట్ క్యాంపింగ్

వికారాబాద్‌లోని అనంతగిరి పర్వతాల్లో డెక్కన్ ట్రైల్స్ ఆహ్లాదభరిత ఈవెంట్ నిర్వహిస్తోంది. విశాలమైన 35 ఎకరాల స్థలంలో నైట్ క్యాంపింగ్, టెంట్స్‌లో బస, డీజే సంగీతంతో పాటు ట్రెక్కింగ్ వంటి సాహసక్రీడలు జత చేసిన వినోదభరిత వేడుకకు స్వాగతం పలుకుతోంది. ఈ తరహా వేడుక నగరవాసులకు కొత్తదనం పంచుతుందనడంలో సందేహం లేదు.

'లైట్' తీస్కోవద్దు!

ప్రయాణంలో వాహనం లైట్ ఆర్పితే ప్రమాదమే...

- మంచుతో రహదారి భద్రతకు ముప్పు
- కొద్దిరోజులుగా దట్టంగా కమ్ముకుంటున్న పొగమంచు



సాక్షి, సిటీబ్యూరో: కొద్ది రోజులుగా రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట రహదారులు రక్తమోడుతున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో, ప్రత్యేకంగా హైవేలపైన ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు వాహనదారులు మృత్యువాత పడ్డారు. మరికొందరు గాయపడ్డారు. ఉదయం పూట మంచుకురిసే వేళలోసరైన జాగ్రత్తలు పాటించకుండా వాహనాలు నడపడం వల్లనే తెల్లవారు జామున ఎక్కువ ప్రమామాదాలు జరుగుతున్నట్లు రహదారి భద్రతా నిపుణులు చెబుతున్నారు. కొద్దిరోజుల నగర శివారు ప్రాంతాల్లో ఓ కారు ఆగి ఉన్న లారీని ఢీకొడంతో కార్లో ప్రయాణం చేస్తున్న వాళ్లు కొందరు చనిపోయారు. పొగమంచు దట్టంగా అలుముకొని ఉండడంతో డ్రైవర్ ఆగి ఉన్న లారీని గుర్తించలేకపోయినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. కొద్ది రోజులుగా ఉదయం వేళల్లోనే చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చలితో పాటు మంచు కూడా కురుస్తూండడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. ఈ క్రమంలో హైవేలపైన వాహనాలను నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

'లైట్' వెలగాల్సిందే...

- దట్టమైన పొగమంచు కమ్ముకొని ఉన్న సమయంలో వాహనాలను నడిపేటప్పుడు కచ్చితంగా ఫాగ్‌లైట్లు వెలుగుతూనే ఉండాలి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొనే ప్రమాదం ఉంది.
- రాత్రి వేళల్లో హైబీమ్ లైట్లకు బదులు లోబీమ్ లైట్లను వినియోగించాలి.
- ప్రధాన రహదారుల మధ్యలో ఉండే డివైడర్లను గమనించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు పొంచి ఉన్నట్లే. ఇలాంటి రహదారులపైన ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీ కొనే అవకాశం తక్కువగానే ఉండొచ్చు. కానీ సరైన వెలుతురు లేకపోవడం వల్ల డివైడర్లే మృత్యుఘంటికలు మోగించే ప్రమాదం ఉంది. పొగమంచు కమ్ముకొని ఉన్నప్పుడు లైట్లు ఆర్పినా, కాంతి తక్కువగా ఉన్నా డివైడర్లను గుర్తించడం కష్టం.
- సాధారణంగా హైవేలపైన కార్లు, ఇతర అన్ని రకాల వాహనాలు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో వెళ్లేందుకు అనుమతి ఉంటుంది. కానీ తెల్లవారు జామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల కంటే వేగం దాటకుండా వాహనాలను నడపాలని ఆర్టీఏ అధికారులు సూచిస్తున్నారు.

వెనుక లైట్లు వెలగాలి...

- రోడ్డు పక్కన బండి నిలిపి ఉంచినప్పుడు హెడ్‌లైట్‌లతో పాటు, వెనుక లైట్లు కూడా వెలుగుతూ ఉండాలి. దీనివల్ల ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. నిలిపి ఉంచిన వాహనం ఉనికిని ఈజీగా గుర్తించేందుకు అవకాశం లభిస్తుంది.
- అలాగే వాహనం చుట్టూ రేడియం టేప్ తప్పనిసరి. దీనివల్ల మంచు కురిసే సమయంలోనూ వాహనం ఉనికి తెలుస్తుంది. చాలా వరకు వాహనదారులు ఈ చిన్న నిబంధనను పాటించకపోవడం వల్ల కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లవారు జామున జరిగే ప్రమాదాల్లో డ్రైవర్లు నిద్రమత్తులో ఉండడం కూడా మరో కారణం. సాధ్యమైంత వరకు ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు వాహనాలను నడపకపోవడమే మంచిది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

- పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఆసమయంలో రోడ్డు మధ్యలో వాహనం నడపడం కంటే ఎడమవైపు నెమ్మదిగా వెళ్లడం మంచిది. వేగాన్ని కూడా 50 కిలోమీటర్ల నుంచి ఇంకా తగ్గించి నడపాలి.
- సాధారణంగా ఉదయంపూట ప్రయాణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఆ సమయంలో ఏదో ఒక సంగీతం వింటూ బండి నడుపుతారు. ఈ ధోరణి ప్రమాదకరమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ 'పాలకమండలి' ఎప్పుడో?

నెలలు గడుస్తున్నా జరగని సమావేశం

- స్టాండింగ్ కమిటీ లేక.. పాలకమండలి లేక ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం విచిత్ర పరిస్థితి నెలకొంది. వివిధ పనులు, ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసే స్టాండింగ్ కమిటీ మనుగడలో లేదు. పాలకమండలి సర్వసభ్య సమావేశం నాలుగునెలలు గడిచిపోయినా జరగలేదు. దీంతో కొత్త ప్రాజెక్టులు, పనులు మంజూరయ్యే పరిస్థితి లేకుండా పోయింది. జీహెచ్‌ఎంసీలో రూ.2 కోట్ల వరకు పనులకు నిధుల మంజూరు అధికారం కమిషనర్‌కు ఉండగా, గత కమిషనర్ దాన్ని జోనల్ కమిషనర్లకు బదలాయించారు. స్టాండింగ్ కమిటీకి రూ.3 కోట్ల వరకు నిధుల మంజూరు అధికారం ఉంది. రూ.3 కోట్లకు మించి రూ.6 కోట్ల వరకు పాలకమండలి ఆమోదంతో ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది. దీంతో వివిధ ప్రాజెక్టుల పనులు మంజూరయ్యే పరిస్థితి లేదు. కొత్త స్టాండింగ్ కమిటీ నవంబర్‌లోనే కొలువు దీరాల్సి ఉండగా ఇంతవరకు ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడలేదు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తన నిబంధనల నేపథ్యంలో ఖాళీ అయిన స్టాండింగ్‌కమిటీకి తిరిగి ఎన్నిక జరగలేదు. ఎన్నికలు ముగిసిపోయినా ఇంత వరకు నోటిఫికేషన్ వెలువడలేదు. మరోవైపు, పాలకమండలి సర్వసభ్య సమావేశం ప్రతి మూడు మాసాల కోమారు జరగాల్సి ఉండగా గత ఆగస్టు తర్వాత తిరిగి ఇప్పటి వరకు నిర్వహించలేదు. గతంలో జరిగిన రెండు సమావేశాలు సైతం తీవ్ర గందరగోళాలు, నిరసనలతో ముగిశాయి.రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీహెచ్‌ఎంసీ బడ్జెట్ సైతం నవంబర్‌లో స్టాండింగ్ కమిటీ ఆమోదం పొంది.. జనవరి రెండో వారంలోగా పాలకమండలి ఆమోదం పొందాలి. ఓవైపు స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరగక, మరోవైపు పాలకమండలి సమావేశం జరగక ప్రస్తుతం ఎలాంటి కొత్త పనులూ మంజూరయ్యే పరిస్థితి లేకుండా పోయింది.

ప్రభుత్వం ఏర్పాటుతో..

మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ స్థానే కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటో తెలియదు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన మునిసిపల్ పరిపాలనశాఖ స్వయానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే ఉండటంతో జీహెచ్‌ఎంసీపై సమీక్ష జరిగితే కానీ ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటో..జీహెచ్‌ఎంసీ పాలనలో ఎలాంటి మార్పులుంటాయో తెలిసే వీలుంది. ఈలోగా ఉన్నతాధికారుల బదిలీలు జరుగుతాయనే ప్రచారం ఉంది. బదిలీల తర్వాతే సమీక్ష ఉండొచ్చంటున్నారు. పాలకమండలి లేకపోతే స్పెషల్ ఆఫీసర్ పాలన ఉంటుంది. అలాంటి సందర్భాల్లో స్పెషలాఫీసర్ నిర్ణయాలే అంతిమం. కానీ పాలకమండలి ఉండి కూడా సమావేశాలు జరగని, నిధులు మంజూరు కాని విచిత్ర పరిస్థితి జీహెచ్‌ఎంసీలో బహుశా ఇదే మొదటిసారి.

'డ్రింకే' కాదు డ్రగ్స్ పట్టేస్తారు!

- జర్మనీలో తయారైన అత్యాధునిక పరికరాలు
- మూడు కమిషనరేట్లకు 25 చొప్పున జారీ
- డిసెంబర్ 31 నుంచి వినియోగానికి నిర్ణయం



డ్రగ్ డిటెక్టర్స్ ఖరీదు చేసిన టీఎస్ నాబ్

సాక్షి, సిటీబ్యూరో: 'డ్రగ్ ఫ్రీ తెలంగాణ' సాకారంలో భాగంలో పోలీసు విభాగం అనేక చర్యలు తీసుకుటోంది. మాదకద్రవ్యాల తయారీ, రవాణా, విక్రయం, వినియోగంపై ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటి వరకు డ్రంక్ డ్రైవింగ్‌పై మాత్రమే దృష్టి పెట్టిన అధికారులు ఇప్పుడు 'డ్రగ్ డ్రైవింగ్'కు చెక్ చెప్పాలని నిర్ణయించారు. డ్రగ్స్ తీసుకుని వాహనాలు నడిపే వారితో పాటు కొన్ని సందర్భాల్లో ఇతర అనుమానితులను గుర్తించడానికి డ్రగ్ డిటెక్టర్స్ సమీకరించుకున్నారు. జర్మనీ నుంచి ఖరీదు చేసిన ఈ అత్యాధునిక పరికరాల్లో 75 పరికరాలను తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (టీఎస్ నాబ్) అధికారులు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలకు అందించారు. డిసెంబర్ 31 రాత్రి నుంచి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

ఇప్పటి వరకు అదే పెద్ద ప్రహసనం...

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల కంటే సిటీలోనే మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువని పోలీసు విభాగం సైతం అంగీకరిస్తున్న అంశం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండల్లో నమోదవుతున్న కేసులు సైతం దీన్నే స్పష్టం చేస్తున్నాయి. ఇక్కడి రోడ్లపై రాత్రి వేళల్లో చోటు చేసుకుంటున్న ప్రమాదాల్లో డ్రంక్ డ్రైవింగ్‌తో పాటు డ్రగ్ డ్రైవింగ్ వల్లా జరుగుతున్నవి ఉన్నాయని చాలా రోజులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. 2011 తర్వాత బ్రీత్ ఎనలైజర్లు పెద్ద సంఖ్యలో అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి డ్రంక్ డ్రైవింగ్‌కు తేలిగ్గా గుర్తిస్తున్నా...డ్రగ్ డ్రైవింగ్ విషయంలో ఇలాంటిది సాధ్యం కావట్లేదు. ప్రమాదకారకులతో పాటు అనుమానితులనీ తీసుకువెళ్లి రక్త నమూనాలు సేకరించి పరీక్షించడం అన్ని సందర్భాల్లోనూ సాధ్యం కావట్లేదు. డ్రైవర్ నిషాలో ఉన్నప్పటికీ బ్రీత్ ఎనలైజర్లు క్లీన్‌చిట్ ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి. ఇలా జరగడానికి డ్రగ్ డ్రైవింగే కారణమని భావిస్తున్నారు. పార్టీలపై పోలీసులు దాడి చేసినప్పుడూ అక్కడ మాదకద్రవ్యాలు దొరికితే తప్ప డ్రగ్ పరీక్షలు సాధ్యం కావట్లేదు.


అబౌట్ కిట్స్ చూపిస్తున్న టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య

రెండు రకాలైనవి 120 కొనుగోలు...

ఇలాంటి సందర్భాలతో పాటు న్యూ ఇయర్ పార్టీల నేపథ్యంలో వినియోగించడానికి జర్మనీలో తయారైన అత్యాధునిక డ్రగ్ డిటెక్టర్లను టీఎస్-నాబ్ అధికారులు ఖరీదు చేశారు. శ్వాస ద్వారా డ్రంక్ డ్రైవర్లను గుర్తిస్తున్నట్లు లాలాజలం ద్వారా స్పాట్‌లో పరీక్షించే డ్రాగర్ కిట్స్ 20, మూత్రం ద్వారా పరీక్షలు చేసే అబౌట్ కిట్స్ 100 ఖరీదు చేశారు. ఈ 120లో 75 మూడు కమిషనరేట్లకు, మిగిలినవి రాష్ట్రంలోని ఇతర కమిషనరేట్లు, జిల్లాలకు అందించారు. ట్రాఫిక్ జంక్షన్లు, చెకింగ్ పాయింట్లతో పాటు అనుమానిత ఫామ్‌హౌస్‌లు, పబ్స్ తదితర ప్రాంతాల్లో డ్రాగర్ కిట్స్ వినియోగించి అక్కడిక్కడే పరీక్షలు చేయనున్నారు. కీలక సందర్భాలతో పాటు అవసరమైన వారికి మాత్రమే అబౌట్ పరీక్షలను వైద్యుల సమక్షంలోనే నిర్వహించనున్నారు. ఈ కిట్స్ డ్రాగర్ కిట్స్ కంటే కచ్చితమైన ఫలితాలు ఇవ్వడంతో పాటు ఇవి న్యాయస్థానంలోనూ ఆధారాలుగా ఉపకరించే నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ అత్యాధునిక కిట్స్ గంజాయి, కొకైన్, బ్రౌన్ షుగర్ సహా మొత్తం 12 రకాలైన మాదకద్రవ్యాలను గుర్తించడానికి ఉపకరిస్తాయి. డిసెంబర్ 31 రాత్రి తనిఖీల్లో వీటిని వినియోగించడానికి మూడు కమిషనరేట్లకు చెందిన అధికారులు సమాయత్తం అవుతున్నారు.

3న సినీనటుడు బ్రహ్మానందానికి స్వర్ణ కంకణ ప్రదానోత్సవం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాఘు సప్త స్వరం 35వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందానికి జీవిత సాఫల్య పురస్కారంతో పాటు స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు విఎస్.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. జనవరి 3వ తేదీన రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమానికి హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పార్లమెంటు సభ్యులు కె.లక్ష్మణ్, రఘురామరాజు, టర్కీ ప్రభుత్వ కన్సల్ట్ జనరల్ యల్మాన్ ఒకన్, సినీ నటుడు మురళీమోహన్‌లతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

స్టాండర్డ్స్ క్లబ్స్ ద్వారా విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు

బీఐఎస్ మెంటార్ల శిక్షణ సదస్సులో వక్తలు



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు భారతీయ ప్రమాణాలు, నాణ్యతపై అవగాహన కల్పించేందుకు విద్యా సంస్థల్లో భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) ఏర్పాటు చేసిన స్టాండర్డ్స్ క్లబ్ ద్వారా విస్తృత ప్రయోజనాలున్నాయని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణాలోని పలు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో బీఐఎస్ ఏర్పాటు చేసిన స్టాండర్డ్ క్లబ్స్ బాధ్యులకు రెండురోజుల శిక్షణ సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లో ముగిసింది. సదస్సు ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథులుగా సాంకేతిక విద్యాశాఖ బోర్డు కార్యదర్శి పుల్లయ్య, బీఐఎస్ సౌత్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యూఎస్‌పీ యాదవ్, సాంకేతిక విద్యాశాఖ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ఏ స్వామి హాజరయ్యారు. స్టాండర్డ్ క్లబ్స్ బాధ్యులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు మెరుగైన భవితను అందించే ఇలాంటి కార్యక్రమంలో భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు. భారతీయ ప్రమాణాలు, నాణ్యతపై విద్యార్థి దశలోనే స్పష్టమైన అవగాహన కల్పించడం ద్వారా భావితరాలకు నాణ్యమైన సమాజం ఏర్పడుతుందని సాంకేతిక విద్యాశాఖ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ఏ స్వామి అభిప్రాయపడ్డారు. అనంతరం బీఐఎస్ డీడీజీఎస్ యూఎస్‌పీ యాదవ్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో కీలక భూమిక వహిస్తున్న భారతీయ ప్రమాణాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు బీఐఎస్ విస్తృత కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అందులో భాగంగానే బీఐఎస్ స్టాండర్డ్ క్లబ్స్ విద్యార్థుల్లో కొత్త నైపుణ్యాలను రూపొందించేందుకు దోహదపడుతున్నాయని తెలిపారు.

బీఎండబ్ల్యూ కారు బీభత్సం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో గురువారం అర్ధరాత్రి బీఎండబ్ల్యూ కారు బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. బొజ్జ వెంకట నాగసాయి లిఖిత్ అనే మెడిసిన్ విద్యార్థి తన నలుగురు స్నేహితులతో కలిసి టిఫిన్ చేసేందుకు అర్ధరాత్రి కారులో వచ్చాడు. టిఫిన్ చేసి జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10 మీదుగా వెళుతుండగా అతి వేగ కారణంగా కారు అదుపుతప్పి ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ సమీపంలోని జీహెచ్ఎంసీ పార్కు ప్రహరీని ఢీకొట్టి అందులో ఉన్న ఓ చెట్టును కూడా ఢీకొట్టడంతో ముందుభాగం నుజ్జునుజ్జైంది. ఈ ధాటికి చెట్టు కూలిపోయింది. ఘటనకు కారకుడైన లిఖిత్‌తో పాటు అందులో కూర్చున్న నలుగురు యువకులకు జూబ్లీహిల్స్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. శ్వాస పరీక్షల్లో ఎవరూ మద్యం సేవించలేదని నిర్ధారణ అయింది. లిఖిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితకు వేధింపులు

నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: పెళ్లికి ముందు ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకొని ఓ యువకుడు వివాహితను వేధిస్తున్న ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని ప్రవంతి నగర్‌లో నివసించే యువతి(19)కి గత జూన్‌లో వివాహం జరిగింది. పెళ్లికి ముందు నవీన్ అనే యువకుడితో సన్నిహితంగా ఉండేది. అయితే వివాహం అయిన తర్వాత కూడా నవీన్ ఆమె ఇంటికి వేధిస్తున్నాడు. తనతో ఉన్న ఫొటోలను భర్తకు చూపిస్తానని బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. ఈ విషయం తెలియడంతో భర్త ఆమెను పుట్టింట్లో వదిలేశాడు. పుట్టింటికి వెళ్లిన తర్వాత కూడా నవీన్ నుంచి వేధింపులు ఆగకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిథమ్ నిధులు దుర్వినియోగం

డైరెక్టర్ చిన్నంరెడ్డిపై ఆరోపణలు

- రూ.13 కోట్ల నిధుల దుర్వినియోగం
- లీజుల రద్దుతో సంస్థకు భారీ నష్టం
- నిధులు లేక జీతాలివ్వలేని పరిస్థితి
- సస్పెండ్ చేసి విచారణ చేయాలని ఉద్యోగుల డిమాండ్
- ప్లకార్డులతో నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నిథమ్ ఉద్యోగులు

గచ్చిబౌలి: హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ రంగంలో అంతర్జాతీయ స్థాయి శిక్షణకు మారుపేరుగా ఉన్న నిథమ్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) నిధులను సంస్థ డైరెక్టర్ చిన్నం రెడ్డి దుర్వినియోగం చేశారని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేందర్ రెడ్డి, ఉద్యోగులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్ ఎదుట ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్నంరెడ్డికి నిథమ్ డైరెక్టర్‌గా అర్హత లేదని స్క్రూటినీ కమిటీ తిరస్కరించినా గత ప్రభుత్వం ప్రత్యేక జీఓ నెం.118 ద్వారా 2015లో పదవీ కాలం, వేతన వివరాలు లేకుండా శేరి చిన్నం రెడ్డిని నిథమ్ డైరెక్టర్‌గా నియమించిందన్నారు. ఆయన ఒంటెత్తు పోకడలతో సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఏ యూనివర్సిటీ వీసీకి లేని విధంగా వేతనం, అలవెన్సులు కలుపుకొని రూ.3.30 లక్షలు తీసుకుంటున్నారన్నారు. అకాడమీని నిర్లక్ష్యం చేస్తూ సివిల్ పనులతో నిధుల దుర్వినియోగం చేశారన్నారు. అదనపు బ్లాక్ కోసం ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం చేపట్టవద్దని స్వచ్ఛంద సంస్థ హైకోర్టులో ఫిల్ వేసినా రూ.4 కోట్లతో నిర్మాణం చేపట్టారని కాగ్ నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే మరో భవనంలో నడుస్తున్న సప్తర్షి హోటల్ లీజును రద్దు చేయడంతో ఏటా వచ్చే రాయల్టీ రూ.1.88 కోట్లు రావడం లేదని, దీంతో రూ.7 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. మాక్ రూమ్ నిర్మాణం కోసం ఏకంగా రూ.40 లక్షలు ఖర్చు చేశారని, క్లాస్ రూమ్‌లను యాక్సెస్ అకాడమిక్ కన్సల్టెంట్‌కు అద్దెకు ఇవ్వడంతో రూ.12.74 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. రూ.40 లక్షలతో క్రికెట్ స్టేడియాన్ని నిర్మించి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని ఆరోపించారు. ఆయన హయాంలో పలు కేసులు దాఖలు కాగా, న్యాయవాదుల ఫీజు పేరిట రూ.2 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. నిథమ్ కార్పస్ ఫండ్ ఖాళీ అయ్యిందని, విద్యార్థుల డిపాజిట్స్ నుంచి రూ.1.5 కోట్లు జీతాల కోసం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం నిథమ్ ఖజానాలో కేవలం రూ.5 లక్షల నిధులు మాత్రమే ఉన్నాయని, జీతాల కోసం ప్రతి నెల రూ.27 లక్షలు అవసరమవుతాయన్నారు. అదనంగా తీసుకున్న జీతం రూ.94 లక్షలు ఆయన నుంచి రికవరీ చేయాలని, కేసు ఓడిపోతే పూర్తి జీతం రికవరీ చేయాలని కాగ్ స్పష్టం చేసిందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ అకాడమిక్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ జరగడం లేదని, ఫ్యాకల్టీ, టూరిజం అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకపోవడంతో ప్లేస్ మెంట్‌లో ఇబ్బందులు ఉన్నాయన్నారు. 920 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య 250కి పడిపోయిందన్నారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీని తప్పించడంతో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడం లేదన్నారు. కాగ్ నివేదికపై ఇప్పటికే టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, టూరిజం సెక్రెటరీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిథమ్ డైరెక్టర్‌గా చిన్నం రెడ్డిని తొలగించి మరో వ్యక్తిని నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ శ్రీధర్, ఫైనాన్స్ ఆఫీసర్ శివయ్య, లైబ్రేరియన్ యాదగిరి, ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫీసర్ హన్మంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరువు నష్టం దావా వేస్తా:

ఉద్యోగులు చెబుతున్నట్లుగా నిధుల దుర్వినియోగం, అవినీతి జరగలేదని, తనపై ఆరోపణలు నిరాధారమని నిథమ్ డైరెక్టర్ డాక్టర్ చిన్నం రెడ్డి అన్నారు. నిధులు దుర్వినియోగం చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. తనపై ఆరోపణలు చేసిన వ్యక్తులపై పరువు నష్టం దావా వేస్తానని ఆయన పేర్కొన్నారు.

– డాక్టర్ శేరి చిన్నం రెడ్డి

పురోగతిలో అమృత్‌భారత్ స్టేషన్లు

సాక్షి, సిటీబ్యూరో : అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఎంపిక చేసిన రైల్వేస్టేషన్ల పునరభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్ తెలిపారు. 69 వ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం శుక్రవారం సికింద్రాబాద్ లోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో జరిగింది. వర్చువల్ గా ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి లోకేష్ విష్ణోయ్ అధ్యక్షత వహించారు. 19 మంది నామినేటెడ్ సభ్యులకుగాను 13 మంది సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన, డివిజన్ సాధించిన విజయాలను వివరించారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) కింద ఎంపిక చేసిన స్టేషన్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. అనంతరం సభ్యులు పలు రైళ్లకు అదనపు స్టాప్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే స్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్లను అమర్చాలని సూచించారు. రైళ్ల సమయపాలనపైన దృష్టి సారించాలని, రైల్వే స్టేషన్లను, రైళ్లను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. సమావేశంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.కోటేశ్వర రావు, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎమ్ఏ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏఏ కేలండర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు న్యాయవాదుల సంఘం కేలండర్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ వినోద్ కుమార్ ఆవిష్కరించారు. శుక్రవారం హెచ్‌సీఏఏ ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో న్యాయమూర్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు, కార్యదర్శులు ప్రదీప్, దేవేందర్, సీనియర్ కార్యవర్గ సభ్యుడు నాగులూరి కృష్ణకుమార్ గౌడ్, బైరెడ్డి శ్రీనివాస్, పూర్ణ శ్రీ, శారద కటకం, శ్రీనివాస్, సునీత, హరేందర్ సింగ్, భరత్ కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు



తజేబుల్ ఖాన్

రంగారెడ్డి కోర్టులు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి శుక్రవారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... ఓ చికెన్ సెంటర్ వ్యాపారి భార్యా, ఇద్దరు పిల్లలతో కలిసి మీర్‌పేట్ ఠాణా పరిధిలో నివాసంఉంటున్నాడు. అతను బీహార్‌కు చెందిన తజేబుల్ ఖాన్(22)ను చికెన్ సెంటర్‌లో పనికి కుదుర్చుకుని తన ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చాడు. దీనిని అసరాగా తీసుకున్న అతను సదరు వ్యాపారి కుమార్తె(06)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం శుక్రవారం నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష తోపాటు రూ. 25వేలు జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.10లక్షల పరిహారం ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.

సిగరెట్ తాగుతూ పీఎస్ ఎదుట రీల్స్ చేసినందుకు..

యువకుడికి 8 రోజుల జైలు శిక్ష



వంశీకృష్ణ

రాంగోపాల్‌పేట్: పోలీస్ స్టేషన్ ఎదుట సిగరెట్ తాగుతూ రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తికి న్యాయస్థానం 8 రోజుల జైలు శిక్ష విధించింది. రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ కథనం ప్రకారం పాటిగడ్డ ఎస్‌బీటీనగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి వంశీకృష్ణ (25) ఈ నెల 17న రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎదుట సిగరెట్ తాగుతూ రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిని గమనించిన రాంగోపాల్‌పేట్ పోలీసులు అతనిపై ఈ పెట్టీ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా సికింద్రాబాద్ 16వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అతడికి 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది.

నిమ్స్‌కు ఐపీసీ సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్



లక్డీకాపూల్ : ఔషధ పరిశోధనల్లో నిమ్స్ క్లినికల్ ఫార్మాకాలజీ అండ్ థెరప్యూటిక్ విభాగం తన ప్రతిభను చాటుకుంటూ నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ ఉనికి చాటుతుందని డైరెక్టర్ ప్రొఫెసర్ నగర బీరప్ప అన్నారు. ఔషధ భద్రతను ప్రోత్సహించడానికి ఈ విభాగం చేసిన కృషికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్(ఐపీసీ) సర్టిఫికేట్ ఆఫ్ అప్రిసియేషన్‌ను జారీ చేయడం గర్వకారణమన్నారు. ఆరోగ్య సిబ్బందికి విద్యా కార్యక్రమాలతో పాటు ప్రజలకు, రోగులకు అనేక అంశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నిమ్స్ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ కార్యక్రమానికి గణనీయంగా దోహదపడిందన్నారు. అందుకు కృషి చేసిన ఆ విభాగం అధిపతి డాక్టర్ ఉషారాణి, పరిశోధన విభాగం డిప్యూటీ కోఆర్డినేటర్ ఎం. పద్మజలను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

పాత పద్ధతిలోనే ఎలక్షన్ కమిషన్ నియామకం జరగాలి

పంజగుట్ట: ఎలక్షన్ కమిషన్ నియామకం పాత పద్ధతిలోనే జరగాలని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆఫ్ సెక్యులర్ డెమోక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో 'నల్లచట్టాలను రద్దు చేయాలి .. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ .. ఎన్నికలు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకే ఎన్నికల కమిషన్ నియామక విధానాన్ని కేంద్రం మార్చిందన్నారు. ప్రధానమంత్రి ఒకరు, మరొకరు ప్రతిపక్ష నాయకుడు, మరొకరు చీఫ్ జస్టిస్ కాకుండా ప్రధాని నామినేటెడ్ చేసిన ఒక వ్యక్తి నియమించేలా మార్పులు చేశారన్నారు. ఇద్దరు బీజేపీ మనుషులు, ఒకరు ప్రతిపక్ష నేత ఉండగా బీజేపీకి మెజారిటీ ఉన్నందున తమకు అనుకూలంగా ఉండేవారిని ఎలక్షన్ కమిషనర్‌గా నియమించుకునే అవకాశం కల్పించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అలాంటి వ్యక్తి న్యాయంగా ఎన్నికలు నిర్వహిస్తారా అన్న అనుమానం మనకు కలుగుతుందన్నారు. మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, సోగరాబేగం, తెలంగాణ విఠల్ మాట్లాడుతూ .. బీజేపీకి ఎన్నికలు సమీపించగానే రాముడు గుర్తుకు వస్తాడని, ఇప్పుడు తిరిగి రామమందిరం ప్రారంభం పేరుతో ప్రచారం చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ 146 మంది సభ్యులను సస్పెండ్ చేసి వారికి అనుకూలంగా ఉన్న బిల్లులను పాస్ చేయించుకున్న చరిత్ర లేదన్నారు. బీజేపీని వ్యతిరేకించిన వారిని అర్బన్ నక్సల్స్‌గా ముద్రవేస్తున్నారని ఆరోపించారు.

మూసారం బాగ్ బ్రిడ్జి పనులు ప్రారంభం

మూసీనదిపై ఉన్న మూసారం బాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వంతెన ఎత్తు తక్కువగా ఉండటంతో ఏటా వర్షాకాలంలో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు పూర్తయితే నగరవాసులకు మూసీ వరద సమస్య నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. - సాక్షి, సిటీబ్యూరో



అలీప్ వికార్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఖైరతాబాద్: భారత ప్రభుత్వం ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన అలీప్ వికార్ట్ ఎగ్జిబిషన్ నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఎంఎస్ఎంఈ, మహిళా గ్రూపు సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను 72 స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచారు. డిసెంబర్ 31 వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది. ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నవీన్‌కుమార్, నాబార్డ్ డీజీఎం శ్రీరాం, యూబీఐ జీఎం ఎస్.కృష్ణన్, అలీప్ చైర్‌పర్సన్ డాక్టర్ జ్యోతి, ఎగ్జిబిషన్ చైర్‌పర్సన్ బి.శైలజ తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారులు

ఎయిడెడ్ కాలేజీలకు పూర్వ వైభవం తేవాలి



సాక్షి, సిటీబ్యూరో: ఎయిడెడ్ కాలేజీలకు పూర్వ వైభవం తేవాలని తెలంగాణ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి డా. గంటా జలంధర్ రెడ్డి, అధ్యక్షులు డా. ఎస్ బిక్షం అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ... ఎయిడెడ్ కళాశాలలకు పూర్వ వైభవం తీసుకు రావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ విషయమై సంఘంతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కన్నతల్లి అంత్యక్రియలకు వెళ్లనివ్వకుండా నిర్బంధం

మహిళపై యువకుడి ఫిర్యాదు

అల్వాల్: ఇంటికి సహాయకుడిగా వచ్చిన వ్యక్తిని తన కన్నతల్లి అంత్యక్రియలకు హాజరుకాకుండా చేసి పైశాచికత్వం చూపిన మహిళపై నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. డిఫెన్స్ కాలనీకి చెందిన అనుపమ తండ్రికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో నగరంలోని ప్రైవేట్ సంస్థ ద్వారా దుర్గాప్రసాద్‌ను కేర్ టేకర్‌గా ఏర్పాటు చేసుకుంది. 20 రోజులుగా దుర్గాప్రసాద్ అనుపమ ఇంట్లో ఉంటూ వారి తండ్రికి సేవలు చేస్తున్నాడు. ఈ నెల 26న దుర్గాప్రసాద్ తల్లి మృతి చెందింది. దీంతో తాను తన తల్లి అంత్యక్రియలకు వెళ్లాలని అనుపమను కోరగా అందుకు ఆమె నిరాకరించింది. మీ స్థానంలో వేరే వారిని రప్పిస్తే గానీ నువ్వు వెళ్లడానికి వీల్లేదంటూ శాసించింది. పైగా అంత్యక్రియలను ఫోన్‌లో వీడియో కాల్ చూడవచ్చంటూ తన పైశాచికత్వాన్ని ప్రదర్శించింది. దీంతో ప్రసాద్ శుక్రవారం అనుపమ ఇంటి నుంచి తప్పించుకుని బయటికి వచ్చి నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరణించిన తన తల్లిని కడచూపు చూడటానికి సైతం అవకాశం లేకుండా తనను నిర్బంధించి మనోవేదనకు గురి చేసిందని అనుపమపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరాడు.